## క్లుప్తంగా

### నందివాడ ఎస్‌ఐగా శిరీష



గుడివాడటౌన్(నందివాడ): నందివాడ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పి.శిరీష గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఈమె జిల్లాలోని గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై నందివాడకు వచ్చారు.

### 19న నందివాడలో మెగా ఉచిత వైద్య శిబిరం

గుడివాడటౌన్(నందివాడ): వైఎస్సార్ వైద్య విభాగం కృష్ణాజిల్లా శాఖ, శ్రీ వెంకటేశ్వర ప్రాథమిక సహకార పరపతి సంఘం నందివాడ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ వైద్య విభాగం కృష్ణాజిల్లా అధ్యక్షుడు డాక్టర్ మలిరెడ్డి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వైద్య శిబిరంలో కంటి, గుండె, దంత తదితర విభాగాలకు చెందిన వైద్య నిపుణులు వైద్యపరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ శీలం సతీష్‌కుమార్, డాక్టర్ చింతపల్లి సుగుణావతి తదితరులు పాల్గొంటారన్నారు. నందివాడ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

### చురుగ్గా సీసీ రహదారి నిర్మాణం

పామర్రు: స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చొరవతో గ్రామ సర్పంచ్ కె.కస్తూరి ఆదేశాల మేరకు సీసీ రహదారి పనులు చురుగ్గా జరుగుతున్నాయని గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక బాలరంగయ్య బడ్డీ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ 15వ ఫైనాన్సు నిధులు రూ.21 లక్షలతో 400 మీటర్ల రహదారిని నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సలీం, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

### గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలి

గుడివాడటౌన్ (నందివాడ): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ అన్నారు. ఈఓపీఆర్డీ జి శ్రీనివాసరావు ఇతర అధికారులతో కలిసి మండలంలోని ఇలపర్రు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు పరిశీలించారు. విద్యార్థులను మధ్యాహ్న భోజనం, ఇతర వసతులు ఎలా ఉన్నాయని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అర్వో ప్లాంట్ పనితీరును పరిశీలించారు. సచివాలయంలో కార్యదర్శుల పనితీరు, ఉద్యోగులకు కావలసిన వసతులు, ఇతర విషయాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ కోటేశ్వరరావు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

### నవ ధాన్యాల సాగు నేల తల్లికి మేలు

పామర్రు: నవ ధాన్యాలను వేసవిలో సాగు చేస్తే నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పార్థసారథి అన్నారు. స్థానిక మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో నవధాన్యాల సాగు పద్ధతిపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు మోతాదుకు మించి రసాయనాలు ఉపయోగించి పంటలు పండిస్తున్నారన్నారు. దీనివలన రసాయన అవశేషాలు ఉన్న ఆహారం తిని ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. రసాయనాల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ విధానంలో సహజ సిద్ధంగా పంటలు పండించాలని అన్నారు. రబీ పంట తర్వాత భూమిని బీడుగా ఉంచకుండా తొలకరి వర్షాల కంటే ముందే 32 రకాల విత్తనాలతో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంతో విత్తన గుళికలను తయారు చేసి విత్తుకుని 45 రోజుల తర్వాత పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చని లేదా భూమిలో కలియదున్నడం వలన భూసారం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం నాగ మల్లీశ్వరి, జిల్లా ఐజీ కో ఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి, క్రిస్పీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### కమ్ముకొస్తున్న మబ్బులతో రైతుల గుండె గుభేల్



మొవ్వ: ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకోవటంతో రైతులు పంట సంరక్షణ పనుల్లో నిమగ్నమయ్యారు. మొవ్వ మండలంలో గురువారం మబ్బులు కమ్ముకు రావటంతో చేతికందిన మినప పైరు చేతికందుతుందో లేదో తెలియక గుండెలు చేత పట్టుకున్నారు. మినపకాయ తీత తీసి గుట్టలపై ఉండటం, పోత మిషన్‌లు అందుబాటులో లేకపోవటంతో రైతులు పరదాలతో వాటిని కప్పివేస్తున్నారు. కొంత మంది రైతులు హడావిడిగా మిషన్‌లతో మినుము నూర్పించి ఇళ్లకు తీసుకుపోతూ కన్పించారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘననివాళి

గుడివాడటౌన్/గుడివాడ రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి వేడుకలు గురువారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవీచౌక్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు జి.వేణుగోపాలరావు, ఆర్యవైశ్య కల్యాణ మందిరం అధ్యక్ష కార్యదర్శులు పోపూరి మోహనరావు, తిరివీధి శ్రీరాములు, బొగ్గరపు తిరుపతయ్య, జగ్గారావు, దండమూడి సీతారామస్వామి, జవ్వాజి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

**వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...**

ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు బిస్కెట్‌లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి శివ, కోశాధికారి లక్ష్మీ నారాయణరెడ్డి, డెప్యూటీ గవర్నర్ దాసరి సుధాకర్, వాకర్స్ మహిళా అధ్యక్షురాలు రమ్యారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం టీఎంఈ రాణి తదితరులు పాల్గొన్నారు.

**నందివాడలో...**

నందివాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలు జరిపారు. ఎంపీపీ పెయ్యల ఆదాం, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, ఏఓ కోటేశ్వరరావు, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**గుడివాడ రూరల్‌లో...**

గుడివాడరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంపీపీ గద్దే పుష్పరాణి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధికారులతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో దేవరపల్లి వెంకటేశ్వరరావు, వెలుగు ఏపీఎం దోమతోటి సాంబశివరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



గుడివాడలో పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు



పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

**మొవ్వలో...**

మొవ్వ: అమరజీవి పొట్టి శ్రీ రాములు త్యాగం మరువరానిదని మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పిట్టు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మొవ్వ మండలం పెదపూడి శాంతి కాంప్లెక్స్‌లో పిట్టు శ్రీనివాసరావు, శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో ప్రిన్స్‌పాల్ వేదాంతం రామలింగశాస్త్రి, పెదపూడి కాశీ కృష్ణ భగవాన్ ఆలయంలో వాసవి క్లబ్ వనితా కూచిపూడి అధ్యక్షురాలు వలివేటి లక్ష్మి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నిర్వహించారు.

**తోట్లవల్లూరులో...**

తోట్లవల్లూరు: స్థానిక వాసవీ ఆలయం వద్ద మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, మహాత్మ గాంధీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజ, మండల అధ్యక్షుడు కొత్త శేష శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు తమ్మన ఉమామహేశ్వరరావు, వాసవీ ఆలయ చైర్మన్ తాడికొండ ఉదయ సూర్యసుధాకర్, నాయకులు తాడికొండ కృష్ణకుమార్, తాడికొండ బాలాజీ, నంబూరి శివన్నారాయణ, తమ్మన సుబ్బారావు పాల్గొన్నారు.



నందివాడ ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న అధికారులు



గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ పుష్పరాణి తదితరులు

**కైకలూరులో...**

కైకలూరు: పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఆయన విగ్రహానికి సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి ఘనంగా నివాళి అర్పించారు. పంచాయతీ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, వార్డు సభ్యులు తోట మహేష్, మహ్మద్ గాలిబ్‌బాబు, పెద్దింటి మురళి, సమతం శ్రీను తదితరులు పాల్గొన్నారు. కైకలూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఆర్యవైశ్య ప్రముఖులు మాల్యాద్రి, కేకే బాబు, మంచికంటి వాసు, అద్దెపల్లి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. కలిదిండి హైస్కూల్ ఆవరణలో శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పూర శ్రీధర్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ తరఫున పేద మహిళలకు నూతన వస్త్రాలు, వికలాంగులకు నగదు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నీలి సుమన్, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఊర కల్యాణి, ఆర్యవైశ్య ప్రముఖులు నూకల శ్యామలరావు గుప్తా, నీలి మాధవి, చక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ నవరత్నకుమారి

**ముదినేపల్లిలో...**

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. మండలంలోని కొర్రగుంటపాలెం, చిగురుకోట శివారు నరసన్నపాలెం, పెయ్యేరు శివారు రంగాపురం, దాకరం పాఠశాలల్లో అమరజీవి చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో అమరజీవి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ముదినేపల్లి, శ్రీహరిపురం సెంటర్లలో శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రజలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. సింగరాయపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద అమరజీవి విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాలు జరిపారు.

**మండవల్లిలో..**

మండవల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ జె.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

**పెదపారుపూడిలో...**

పెదపారుపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**గుడ్లవల్లేరులో...**

గుడ్లవల్లేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.దిలీప్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు నరసింహారావు, రమేష్, ఎలీషారావు, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. అమరజీవి జయంతిని పురస్కరించుకుని వాసవీ క్లబ్ అధ్యక్షురాలు అనసూయ చేతుల మీదుగా వైద్యం నిమిత్తం ఆర్థికసాయం, అన్నదానం తదితర కార్యక్రమాలను చేపట్టారు.

### పామర్రులో...

పామర్రు: అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను గురువారం పామర్రులో ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు, జాతిపిత గాంధీజీల విగ్రహాలకు పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు బి.సాయిబాబు, ఎం.రఘురాంబాబు, ఎం.సత్యసాయి, తాళ్లూరి నరేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బందరు రోడ్డులోని వాసవీ వృద్ధ శరణాలయంలో ఉన్న గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు రూ.200 చొప్పున పెన్షన్‌ను అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ డిస్ట్రిక్ ఇన్‌చార్జి బొగ్గరపు సాయిబాబు, జోన్ చైర్మన్ కొత్తా శివ మోహన పుల్లారావు, క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ పరిసా వెంకట నాంచారయ్య, శరణాలయం నిర్వహకులు ఘంటసాల భరతుడు పాల్గొన్నారు.



పామర్రులో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు



పెదపూడిలో నివాళులర్పిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు



తోట్లవల్లూరులో శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

## ఇంటి నిర్మాణాలు పరిశీలించిన ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ఏలూరు రోడ్డులో వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలను గురువారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి పూడిక పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్త హోమ్స్ సంస్థ ద్వారా నాణ్యతా ప్రమాణాలతో ఇంటి నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేయించుకోవాలన్నారు. జగనన్న గ్రీన్ విలేజ్‌లో అన్ని మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే విద్యుత్, తాగునీరు, రహదారులు వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు పాల్గొన్నారు.

**జగనన్న కాలనీ లబ్ధిదారులతో సమీక్ష**

జగనన్న కాలనీ గృహాల లబ్ధిదారులు ప్రైవేటు బ్యాంకుల్లో రుణాలు పొంది ఇబ్బందులు పడవద్దని ఎంపీడీ అడవి కృష్ణ చెప్పారు. ఏలూరు రోడ్‌లో జగనన్న గ్రీన్ విలేజ్ లే అవుట్‌లో ఇంటి స్లాబ్ పనులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రభుత్వ అనుబంధ బ్యాంకు మేనేజర్లతో రుణాల మంజూరు విషయమై సంప్రదింపులు జరుపుతున్నారని, లబ్ధిదారులు తొందరపడి ఎక్కువ వడ్డీకి ప్రైవేటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవద్దని చెప్పారు. సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి మాట్లాడుతూ కైకలూరు లేఅవుట్‌లో జిల్లాలోనే అత్యంత ఎక్కువమంది లబ్ధిదారులకు నివేశన స్థలాలు కేటాయించారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీడీవో రామలింగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ శేఖర్, బ్యాంకు ప్రతినిధులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కైకలూరు గ్రీన్ విలేజీలో ఇంటి నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

## శేరీవేల్పూరు జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం

గుడివాడరూరల్: ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చొరవతో మండలంలోని శేరీవేల్పూరు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులు గృహాలను నిర్మించుకునేందుకు వీలుగా విద్యుత్‌శాఖ అధికారులు గురువారం విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. ఇప్పటికే కొంతమంది గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను లబ్ధిదారులు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన దుక్కిపాటి ఎమ్మెల్యే కొడాలి నానికి సమస్యను వివరించారు. ఎమ్మెల్యే నాని విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే నాని ఆదేశాలతో హుటాహుటిన విద్యుత్‌శాఖ అధికారులు గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో నూతనంగా విద్యుత్ స్తంభాలను నిర్మించే పనులను చేపట్టి పూర్తి చేశారు. లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కొడాలి నానితో పాటు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



శేరీవేల్పూరులో కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

## రాజశ్యామల అమ్మవారికి కల్యాణమస్తు సినిమా బృందం పూజలు

తోట్లవల్లూరు: కల్యాణమస్తు సినిమా బృందం మండలంలోని భద్రిరాజుపాలెం గ్రామానికి గురువారం విచ్చేసింది. త్వరలో విడుదల కానున్న కల్యాణమస్తు సినిమా విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక రాజశ్యామల ఆలయంలో అమ్మవారికి హీరో అయాన్‌వర్మ, దర్శకుడు సాయి, నిర్మాత బోయపాటి రఘుబాబు ప్రత్యేకపూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో అగ్నేష్ అమిత్‌రాజ్ గురు ఆధ్వర్యంలో రాజశ్యామల సుదర్శన హోమం నిర్వహించారు. హోమం అనంతరం అమ్మవారిని దర్శించుకుని సినిమా విజయవంతం కావాలని ప్రార్థించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్ల పూర్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



రాజశ్యామల అమ్మవారికి పూజలు చేస్తున్న హీరో అయాన్‌వర్మ, దర్శకుడు సాయి, నిర్మాత రఘుబాబు

## ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

పామర్రు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో తెలుగు, సంస్కృతం పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ డి.సుధాకరరావు మాట్లాడుతూ ఈ కేంద్రంలో 183 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా వీరిలో ఏడుగురు గైరు హాజరు కాగా 176 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. నిమ్మకూరు గ్రామంలోని ఏపీ గురుకుల కళాశాలలో కూడా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలను నిర్వహించారు.

**మొవ్వలో...**

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో గురువారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రాశాంత వాతావరణంలో ప్రారంభమైయ్యాయి. ద్వితీయ సంవత్సర పరీక్షలకు 218 మంది హాజరవ్వాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరై 213 మంది పరీక్ష రాశారు. కాగా ఈ పరీక్షా కేంద్రాన్ని వృత్తి విద్యా కోర్సుల జిల్లా అధికారి బిఎస్ఆర్‌వి ప్రసాద్ పరిశీలించారు. డీవోగా ఎల్ హిరణ్మయి, ఛీఫ్ సూపరింటెండెంట్‌గా కే కిరణ్ కుమార్ వ్యవహరించారు. రెండవ లాంగ్వేజ్‌గా తీసుకున్న తెలుగు, హిందీ, సంస్కృతం సబ్జెక్టుల పై పరీక్షలు జరిగాయి.



పామర్రులో పరీక్షకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు



మొవ్వలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

## అన్ని వర్గాలకూ ప్రాధాన్యం

- జనరంజక బడ్జెట్
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆయా వర్గాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్ జనరంజకంగా ఉందని పలు వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమంతో పాటు, అభివృద్ధికి పెద్దపీట వేశారని అభిప్రాయపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంపై ప్రశంసిస్తున్నారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధికి, వార్డు, గ్రామ సచివాలయాలకు నిధులు కేటాయించడం స్వాగతించే విషయమంటున్నారు. యువత స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఏకంగా రూ. 1.166 కోట్లు కేటాయించడం శుభపరిణామం అని పేర్కొంటున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి రూ.15,882 కోట్లు కేటాయించడం చరిత్రలో ఇదే మొదటి సారి అని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


### వైద్యరంగానికి పెద్ద పీట



బడ్జెట్‌లో వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి ఏకంగా రూ.15,882 కోట్లు కేటాయించడం మంచి పరిణామం. అందరికీ సూపర్‌స్పెషాలిటీ వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

–డాక్టర్ మెహబూబ్ షేక్, జోనల్ ఇన్‌చార్జి వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం

### కాపుల పక్షపాతి



బడ్జెట్‌లో కాపుల సంక్షేమానికి రూ.4887 కోట్లు కేటాయించడం హర్షణీయం. కాపు మహిళలకు కాపునేస్తం అమలు చేస్తూ బాసటగా నిలుస్తున్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా కాపు యువతకు ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తూ కాపుల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారు.

– యర్రంశెట్టి అంజిబాబు, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం

### లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



గుడివాడటౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని సమాజం దానిని వ్యతిరేకించాలని కళాభారతి కళాకారులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. కళాభారతి కళాకారులు జరిపిన ఈ జాతాలో ఆడపిల్లలకు 21 సంవత్సరాలు దాటాక వివాహం చెయ్యాలని, మగవారికి 25 సంవత్సరాలు నిండాలంటూ, అంటు వ్యాధులు రాకుండా జాగ్రత్తపడాలని, క్షయ, కుష్టు, ఎయిడ్స్ వంటి వ్యాధులతో అప్రమత్తంగా ఉంటూ సరైన సమయంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లి, బిడ్డ సంక్షేమ పథకాలు, ఆరోగ్యశ్రీ, ఇతర ఆరోగ్య పథకాలను వివరించారు. కార్యక్రమంలో రీజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణదొర, పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ సతీష్ కుమార్, ఐసీటీసీ, అంకిత ప్రాజెక్ట్ సిబ్బంది, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ముదినేపల్లిలో ఆక్రమణల తొలగింపు

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి పంచాయతీ పరిధిలో రోడ్ల మార్జిన్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న దుకాణాలను పంచాయతీ అధికారులు గురువారం తొలగించారు. స్థానిక బంటుమిల్లి, గురజ రహదారుల మార్జిన్లలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని పలువురు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సంతబజారులో సైతం ఆక్రమణలు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. దీనివల్ల వాహనాల రాకపోకలకు తరచూ అంతరాయం ఏర్పడుతూ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పలు ఫిర్యాదులు అందిన మీదట పంచాయతీ అధికారులు స్పందించారు. ఈవోపీఆర్డీ విజయసారథి దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులకు నోటీసులు జారీ చేసి స్వచ్ఛందంగా తొలగించాలని కోరారు. అయినప్పటికీ వ్యాపారులు తొలగించకపోవడంతో తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపీడీవో పి.మల్లీశ్వరి, ఎస్ఐ షణ్ముఖసాయి పర్యవేక్షణలో గురువారం దుకాణాలను తొలగించారు.

### తాగునీటి పథకం చెరువుకు మరమ్మతులు

మండవల్లి: మండవల్లి అగ్రహారంలోని రెండో రక్షిత తాగునీటి పథకం చెరువు (కొండ్రాయి చెరువు) వద్ద గురువారం కరెంటు ఫీజులు కాలిపోవడంతో సర్పంచ్ దంపతులు మెండా ఝాన్సీ, సురేష్ అక్కడకు వెళ్లి తాగునీటికి అంతరాయం కలుగకుండా కొత్త ఫీజులు ఏర్పాటు చేయించారు.

### 20న ఐటీఐ అప్రెంటీస్ మేళా

గుడివాడటౌన్: స్థానిక కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ ప్రాంగణంలో ఈనెల 20న మెగా అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కేజీకే చౌదరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల వారు నిర్వహించే ఈ అప్రెంటీస్ మేళా అనంతరం ఉద్యోగ అవకాశాలు కూడా అక్కడే పొందవచ్చునని అన్నారు. ఐటీఐ పూర్తిచేసి అప్రెంటీస్ చేయని విద్యార్థులు ఈనెల 20వ తేదీ ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్‌లతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 93943 32229, 81436 59307లను సంప్రదించవలసిందిగా కోరారు.

### గృహ నిర్మాణ పనులు వేగవంతం

పెదపారుపూడి: జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ నిర్మాణ పనులపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా గృహ నిర్మాణ పనులు ఏఏ దశలో ఉన్నాయో హౌసింగ్ ప్రత్యేకాధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.